# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 107 | విశాఖపట్నం | 17-1-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :107 | VISAKHAPATNAM | 17-1-2026 SATURDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902






# తొడకొట్టిన పందెం కోళ్లు

- మినీ స్టేడియాన్ని తలపించేలా బరులు
- ఏపీలో చేతులు మారిన కోట్లాది రూపాయలు
- బహిరంగంగానే కోడి పందెలు జరుగుతున్నా.. చోద్యం చూస్తున్న పోలీసులు

**ఉభయ గోదావరి జిల్లాలు, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి.గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబల పట్నంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిసు_న్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు.కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.



## మన్యానికి పండుగ కళ.. కళకళలాడుతున్న గ్రామాలు

4లో

## బోసిబోయిన విశాఖ నగరం

3లో



## చిత్రావతిలో నది నుంచి పెద్ద ఎత్తున

# ఇసుకను తోడేస్తున్నారు!

**అనంతపురం, పతాకం న్యూస్:** ఉచితం మాటున వ్యాపారులు యథేచ్ఛగా ఇసుకను తోడేస్తూ, ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సామాన్యులు తమ నిర్మాణాలకు ఇసుక దొరకడం లేదని వాపోతున్నారు. జిల్లాలో ఇసుక అవసరాలు తీరుస్తున్న వనరుల్లో చిత్రావతి నది ఒకటి. జిల్లాలో ఈ నది దాదాపు 100 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఈ నది, పరిసర ప్రాంతాలు ఇసుక వ్యాపారులకు కల్పతరువుగా మారాయి. కొందరు రాత్రిపూట ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను నది నుంచి తోడి తమకనుకూలమైన ప్రాంతాలకు తరలిస్తున్నారు. బేరం కుదిరిన తర్వాత డంపు చేసిన ఇసుకను మరోచోటుకు రవాణా చేస్తున్నారు. ఆదాయం బాగుండటంతో వ్యాపారులు నదిలో ఇసుక మేట కనపడితే చాలు తోడేస్తున్నారు. దీంతో నదీలో ఇసుక ఖాళీ అవుతోంది. ఈక్రమంలో ఎటుచూసినా గుండ్లు, రాళ్లు దర్శనమిస్తున్నాయి. ఇసుకను సొంత అవసరాలకు తప్ప వ్యాపార నిమిత్తం తరలించరాదని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అయితే గృహాల నిర్మాణానికి ఇసుక తోలుతున్నామంటూ ట్రాక్టర్లో నింపుకుని తమ సొంత స్థలాల్లో డంపు చేస్తున్నారు. గృహ నిర్మాణాలకు కాస్త తోలి మిగిలిన వందల ట్రాక్టర్లను రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇసుకను తోడేస్తే నదిని ఆనుకుని ఉన్న తమ భూములు కోతకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవిస్తున్నా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా పొలాల కింద ఇసుక తీయవద్దని వ్యాపారులను ఎవరైనా అడ్డుకుంటే 'నదిలో ఇసుక తవ్వుతున్నాం. ఇందులో మీకేం సంబంధం అంటూ దౌర్జన్యం చేస్తున్నారని ఎనుములపల్లి, రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి రైతులు వాపోతున్నారు. ఇలా ఇసుకను తవ్వేస్తే పొలాల్లోని బోరుబావులు



సైతం ఎండిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని ఇసుక అక్రమాలను కట్టడి చేయాలంటూ కోరుతున్నారు.

అమడగూరు, ఓడీ చెరువు మండలాల్లో మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తూ ట్రాక్టర్‌కు రూ.మూడు వేలు వసూలు చేస్తున్నారు. వాగులు, వంకలు, ఏరుల్లో నుంచి ఇసుకను యంత్రాల సాయంతో తోడి రహస్య ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. తర్వాత రాత్రిపూట రాష్ట్రం దాటించి వేలు లక్షల రూపాయలు గడిస్తున్నారు. మహమ్మదాబాదు క్రాస్‌లో దాదాపు 25 ట్రాక్టర్లు పెట్టుకొని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఇసుక మాఫియాగా మారారని చుట్టుపక్కల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## దాడి!

బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే రాష్ట్రాలు బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం.

ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. ప్రధాన మంత్రి హోదాలో నరేంద్రమోడీ రెండు సార్లు వచ్చినప్పటికీ సాకారం కాని రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారి కాకపోవడం గమనార్హం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి.

సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోంది. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది, ఈ ఉద్యమంలో కేరళ ప్రజలందరూ భాగస్వాములుకావడం బిజెపి కుత్సిత రాజకీయాలకు గుణపాఠం! అయితే, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పకపోవడం పచ్చి అవకాశవాదం! ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది.

## 52 మంది మావోయిస్టులు లొంగుబాటు



**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. లొంగిపోయిన 21 మంది మహిళలు సహా లొంగిపోయిన కార్యకర్తలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్ర-ఒడిశా బోర్డర్ డివిజన్, భమ్రాఘర్ ఏరియా కమిటీ (మహారాష్ట్ర) మావోయిస్టులలో చురుకుగా ఉన్నారని వారు తెలిపారు. "పూనా" మార్గెమ్ చొరవ కింద వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. పొరుగున ఉన్న సుక్మా జిల్లాలో 29 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అంతకుముందు, జనవరి 8న పొరుగున ఉన్న దంతెవాడ జిల్లాలో 63 మంది మావోయిస్టులు లొంగిపోగా, జనవరి 7న సుక్మాలో 26 మంది కార్యకర్తలు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి చేరారు. 2025లో రాష్ట్రంలో 1,500 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలించాలని కేంద్రం సంకల్పించింది.

## టికెట్ ఛార్జీల నిర్ణయం 'వ్యాపార రహస్యం' : భారత రైల్వే



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రైలు టికెట్ ఛార్జీలను నిర్ణయించడానికి ప్రమాణాలను వెల్లడించలేమని భారత రైల్వే తెలిపింది. టికెట్ ఛార్జీలను లెక్కించే పద్ధతి రైల్వేల 'వ్యాపార రహస్యం' మరియు వాణిజ్య సమగ్రతకు సంబంధించిన విషయం అని రైల్వే బోర్డు కేంద్ర సమాచార కమిషన్‌కు తెలియజేసింది. ఛార్జీల నిర్ణయ వివరాలను కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించిన తర్వాత రైల్వే బోర్డు ఈ వివరణ ఇచ్చింది. బేస్ ఫేర్‌ను లెక్కించే పద్ధతి, డైనమిక్ ధర మరియు టికెట్ ఛార్జీలు ఎలా ప్రభావితమవుతాయి వంటి సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరాడు. అయితే, ఛార్జీల నిర్ణయ విధానాలు రైల్వేల మేధో సంపత్తి హక్కుల పరిధిలోకి వస్తాయని, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 8 కింద మినహాయింపు పొందాయని రైల్వే వెల్లడించింది. రైల్వేలు వాణిజ్య సంస్థగా పనిచేస్తాయని, లాభాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నందున, అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమని రైల్వే బోర్డు పేర్కొంది. రైల్వేల వాదనను అంగీకరిస్తూ, కేంద్ర సమాచార కమిషన్ సమాచారం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

## ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారం పై సుప్రీం కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ నివేదిక అందించారు. ఇప్పటివరకు ఏడుగురు ఎమ్మెల్యేలపై విచారణ జరిపి తీర్పు వెలువరించారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో స్పీకర్ విఫలమయ్యారని బిఆర్‌ఎస్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మిగతా ఎమ్మెల్యేల విచారణకు అత్యున్నత న్యాయస్థానం 4 వారాల గడువు ఇచ్చింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. తప్పిన పెనుప్రమాదం



**కొత్తకోట, పతాకం న్యూస్:** కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులో కొండపై నుండి కిందకు దిగుతున్న కారు ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమయ్యింది. అయితే పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘాట్ రోడ్డుపై సూచిక బోర్డులు లేకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా ప్రభల ఉత్సవం..
## లక్షలాదిగా తరలిరానున్న భక్తులు



**అంబేద్కర్ కోనసీమ, పతాకం న్యూస్:** జిల్లాలోని అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో ప్రసిద్ధమైన ప్రభల ఉత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ ఉత్సవం కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తున్నారు. సుమారు 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంప్రదాయ ఉత్సవంలో ఏకాదశ రుద్రుల ప్రభలు 11 గ్రామాల నుంచి ఊరేగింపుగా జగ్గన్నతోటకు తరలిరానున్నాయి. ముఖ్యంగా గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం నుంచి కౌశిక నదిని దాటుకుంటూ గ్రామస్తులు ప్రభలను తీసుకురావడం ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవాలి. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, ఇరుసుమండ, వక్కలంక వంటి గ్రామాల నుంచి కూడా ప్రభలు ఊరేగింపుగా రానున్నాయి. లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు తరలిరానున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రభల ఉత్సవానికి ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జగ్గన్నతోటకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే ప్రభల ఉత్సవంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య సిబ్బందిని కూడా ఉంచారు. ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర పండుగ హోదాతో జగ్గన్నపేట ప్రభల ఉత్సవం ఇకపై ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

### ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు...
## నేడు శంకుస్థాపన చేయనున్న చంద్రబాబు, పవన్



**కాకినాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హరిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఒక చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే భారీ పరిశ్రమకు కాకినాడ వేదిక కాబోతోంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థ సుమారు రూ.13 వేల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాది క్రితమే ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా, ఇప్పుడు ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుంది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత టెక్నాలజీతో పనిచేసే ఈ ప్లాంట్ ద్వారా ఏటా 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడలో సుమారు 495 ఎకరాల విస్తీర్ణంలో, గతంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ ఉన్న ప్రదేశంలో ఈ కొత్త ప్లాంట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 2027 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు చేపట్టనున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి, 11:20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, అనంతరం ప్రసంగిస్తారు. బొగ్గు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలతో తయారు చేసే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా, ఈ గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో ఎలాంటి కర్బన ఉద్గారాలు వెలువడవు. పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా తయారయ్యే ఈ ఇంధనం పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించదు. ప్రపంచ దేశాలు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా పెట్టుకున్న ప్రస్తుత తరుణంలో, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాకినాడ పోర్టుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే ఈ ప్లాంట్ ఉండటం వల్ల, ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు అద్భుతమైన అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఏఎమ్ గ్రీన్ సంస్థ జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్‌ఈతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుతో పాటే, కాకినాడలోనే సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో 2 గిగావాట్ల సామర్థ్యం గల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్ జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ హరిత ఇంధన పటంలో కీలక స్థానంలో నిలపనుంది.

## ఘనంగా తెప్పోత్సవం



**ప్రకాశం, పతాకం న్యూస్:** సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఉప్పుగుండూరులోని శ్రీవేణుగోపాలస్వామి, ఆళ్వారాజుల దేవస్దానం సంబందించి స్వామివారి తెప్పోత్సవం ఊరచెరువులో అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజారి దీవి శ్రీధర్ బాబు, ప్రత్యేక అలకరణ చేసారు దేవస్దానం చైర్మన్ మాగులూరి సత్యనారాయణ, ఇ ఓ రామకృష్ణ లు పర్యవేక్షించారు అనంతరం విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమాలను వివిదగ్రామాలు ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

# ప్రజలకు, రైతులకు కనుమ శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం చంద్రబాబు



**కుప్పం, పతాకం న్యూస్:** కనుమ పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా రైతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా వచ్చే కనుమ అనేది రైతు జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగిన పండుగ అని ఆయన పేర్కొన్నారు. తమ వ్యవసాయానికి సహకరిస్తున్న పశువుల పట్ల కృతజ్ఞత వ్యక్తపరచే రోజు కనుమ అని తెలిపారు. ఈ పండుగ కేవలం సంప్రదాయంగా జరుపుకునే వేడుక మాత్రమే కాదని, మనిషి--ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే పర్వదినమని సీఎం అన్నారు. పశుసంపదే రైతుల నిజమైన ఆస్తి అని స్పష్టం చేశారు. పొలాల్లో నాగలి లాగుతూ కష్టపడే ఎద్దులు, కుటుంబాలకు పోషణ అందించే పాడిపశువులు ఇవన్నీ రైతు జీవితంలో విడదీయరాని భాగమని వివరించారు.

## మూన్నాళ్ల ముచ్చటేగా మారిన ‘మహిళా మార్టులు’



**మాడుగుల, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాల నిధులతో ఏర్పాటు చేసిన ‘మహిళా మార్ట్’లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. సభ్యులకు తెలియకుండా గత ఏడాది సెప్టెంబరు 20న మార్టును మూసివేశారు. అందులో సామగ్రిని సైతం డిసెంబరులో అమ్మేశారు. మొత్తం మీద రూ.37 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్టు లెక్కలు తేల్చారు. మరోవైపు మార్టులో చేపట్టిన ఇంటీరియర్ పనులకు తాము డబ్బులు ఖర్చు పెట్టామంటూ ఇటు వెలుగు, అటు పంచాయతీ అధికారులు వేర్వేరుగా చెబుతున్నారు. ఈ నెల 8న జరిగిన పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఈ వ్యవహారం బయటపడింది. వివరాల్లోకి వెళితే.. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి మాడుగులలో మార్టును ఏర్పాటు చేస్తామని, ఇందుకు పెట్టుబడిగా ఒక్కో సభ్యురాలు నుంచి రూ.200 చెల్లించాలంటూ వెలుగు అధికారులు 2022వ సంవత్సరంలో బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. మండలంలో 1,580 సంఘాలకు చెందిన 15,837 మంది నుంచి రూ.200 చొప్పున రూ.31,67,400 వసూలు చేశారు. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న సామాజిక భవనంలో మహిళా మార్ట్ పెట్టేందుకు రూ.15,05,000లతో ఇంటీరియర్, కరెంటు, ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఈ పనులను ప్రజ్ఞా ఇంటీరియర్ వర్క్స్ వారికి అప్పగించారు. అయిన ఖర్చులను వెలుగు రికార్డుల్లో నమోదు చేశారు. మిగిలిన రూ.16,62,400తో సరుకులు కొనుగోలుచేసి అదే ఏడాది డిసెంబరులో మార్టును ప్రారంభించారు. ఇందులో పనిచేయడానికి డ్వాక్రా మహిళలకు అవకాశం ఇవ్వకుండా అప్పటి వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు 11 మందిని నియమించారు. వారికి నెలకు లక్ష రూపాయల వరకు జీతాలు చెల్లించడం మొదలుపెట్టారు. అయితే మార్టులో అనుకున్నమేర వ్యాపారం జరగపోవడంతో సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మార్టు ఏర్పాటులో జరిగిన అక్రమాలు, పొరపాట్లను డ్వాక్రా సభ్యులు ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆయన వెలుగు అధికారులను ఆదేశించారు. కానీ ఆయన ఆదేశాలను అధికారులు పెడచెవిన పెట్టి, మండల సమాఖ్య తీర్మానం లేకుండా గతేడాది సెప్టెంబరు 20న మార్టును మూసివేశారు. అందులోని సామగ్రిని డిసెంబరు నెలాఖరున విక్రయించారు.

## 26 నుంచి కాగ్నిజెంట్ కార్యకలాపాలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ విశాఖలో తాత్కాలిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమైంది. కాపులుప్పాడలోని 22.19 ఎకరాల్లో చేపట్టిన శాశ్వత క్యాంపస్‌కు గతేడాది డిసెంబరు 12న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అదే సమయంలో హిల్-2లోని మహతి బ్లాక్‌లో తాత్కాలిక కార్యాలయ భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఇక్కడ 800 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సంస్థ ఉద్యోగులు 500 మందిని బేస్ లొకేషన్ ప్రాతిపదికన విశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు సైతం ఇచ్చారు. మరో 300 మంది సీనియర్ ఉద్యోగులను ఇక్కడికి బదిలీ చేశారు. లాజిస్టిక్, ఆపరేషనల్ సమస్యలను పరిష్కరించి ఈనెల 26వ తేదీ నుంచి కార్యకలాపాలకు పచ్చజెండా ఊపనున్నారు. మరో 4,500 మంది ఉద్యోగులు విశాఖ వచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ ఇప్పటికే తెలిపారు. వాస్తవానికి కాపులుప్పాడ శాశ్వత క్యాంపస్‌లో విడతలవారీగా 8 వేల మందికి ఉపాధి కల్పించాలని తొలుత నిర్ణయించారు. శంకుస్థాపనకు గంట ముందు సీఎం, కాగ్నిజెంట్ సీఈవో భేటీలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. 25 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఎం కోరారని, దానికి కట్టుబడి ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ఇదే జరిగితే వచ్చే మూడు, నాలుగేళ్లలో విశాఖ ఐటీ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో**

## కొత్తవలసలో గిరిజన క్రికెట్ టోర్నమెంట్



**పార్వతీపురం పతాకం న్యూస్:**స్థానిక పార్వతీపురం మండలం రవి కోన పంచాయితీ కొత్తవలస గ్రామంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ, ఆదివాసి గిరిజన సంఘం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హెచ్. సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు ఈ మధ్యకాలంలో ఎక్కువగా యువత చెడు మార్గాలకు అలవాటు పడిపోతున్నారని, ఈ మధ్యకాలంలో యువత మద్యం డ్రగ్స్ గంజాయికి బానిసవుతున్నారని, అదేవిధంగా ఈ మధ్యకాలంలో నెల్లూరులో సిపిఎం కార్యకర్తపై డ్రగ్స్ గంజాయి మాఫియా హత్యాచారం చేశారని అన్నారు. ఇటువంటి చెడు అలవాట్లు వల్ల మత్తులో ఏం చేస్తున్నారని డ్రగ్స్ గంజాయి నిర్మూలించాలని అన్నారు,

రవికోన పంచాయతీ సర్పంచ్ కె. రామస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ కాకుండా వివిధ పాటలు ముగ్గుల పోటీలు నిర్వహిస్తే బాగుంటుందని, పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విద్యార్థులు డిగ్రీలు పీజీలు చేసి ఇళ్లలో ఖాళీగా ఉంటున్నారని, ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని, యువత అంతా వలసలకు పోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎల్లందొర ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏడాది గేమ్స్ నిర్వహిస్తున్నాము కాని, క్రికెట్ వాలీబాల్ కాకుండా అనేక అనేక గేమ్స్ కూడా నిర్వహించుకుంటే బాగుంటదని, మిగతా పంచాయతీలు కూడా కలుపుకుంటే బాగుంటుందని, ఉన్నత స్థాయిలో గేమ్స్ నిర్వహించి మండల జిల్లా స్థాయిలో చేరుకోవాలని, రవికోన పంచాయతీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు, అదేవిధముగా మొదటి స్థానం ద్వితీయ స్థానం కొత్తవలస టీములు గెలుపొందయి ఈ సందర్భంగా రాయికోన పంచాయతీ సర్పంచ్ కె. రామస్వామి ప్రధానోపాధ్యాయులు ఎల్లన్న దొర చేతుల మీదుగా చేతుల మీదగా ట్రోఫీ ప్రైస్ మనీ ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైకోన పంచాయతీ వైస్ సర్పంచి హెచ్. లక్ష్మణరావు వార్డు నెంబర్లు గంగులు లక్ష్మణరావు పెంటయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బోసిబోయిన విశాఖ నగరం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నిత్యం రద్దీగా కనిపించే నగరం బోసిపోయింది. నగరవాసుల్లో అత్యధికులు సంక్రాంతి పండుగ కోసం స్వస్థలాలకు వెళ్లడంతో ప్రధాన రోడ్లు, కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఊళ్లో ఉన్నవారు సాయంత్రం బీచ్‌కు వెళ్లడంతో...అక్కడ కాస్త సందడి కనిపించింది. ఉద్యోగ, ఉపాధి, విద్య కోసం ఎక్కడెక్కడో స్థిరపడినవారు సంకాంత్రి పండుగకు తమ స్వస్థలాలకు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. నగరంలో నివసిస్తున్న వారిలో అత్యధికులు ఉత్తరాంధ్రతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల చెందినవారు ఉన్నారు. ఏడాదంతా ఉద్యోగం, వ్యాపారం ఇతర వ్యాపకాల్లో బిజీగా గడిపిన వారంతా సంక్రాంతికి మాత్రం తప్పనిసరిగా తమ స్వస్థలాలకు వెళుతుంటారు. విద్యా సంస్థలకు ప్రభుత్వం 11 నుంచి సెలవులు ప్రకటించడంతో చాలామంది అప్పుడే ప్రయాణమయ్యారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు, వ్యాపారులు, కూలిపనులు చేసుకునేవారు ముందుగా వెళ్లిపోయేందుకు అవకాశం ఉండదు కాబట్టి.. మరికొందరు ఉదయం భోగి పండుగను జరుపుకుని తమ స్వస్థలాలకు పయనమయ్యారు. దీనివల్ల బుధవారం మధ్యాహ్నం వరకూ అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారుల్లో కొంత వాహనాల రద్దీ కనిపించినా తర్వాత పూర్తిగా తగ్గిపోయింది. నిత్యం వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌తో పద్మవ్యూహాన్ని తలపించే హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, సత్యం జంక్షన్, ద్వారకా నగర్, జగదాంబ జంక్షన్, ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నిర్మానుష్యంగా కనిపించాయి. వాహనాల రాకపోకలు తగ్గిపోవడంతో ప్రధాన రహదారులు కూడా ఖాళీగా కనిపించాయి. సెలవు రోజుల్లో సందర్శకులతో కోలాహలంగా ఉండే బీచ్, జూపార్క్ కూడా వెలవెలబోయాయి. ఊరెళ్లకుండా నగరంలోనే ఉండిపోయినవారు మాత్రం సాయంత్రం ఆర్కే బీచ్‌కు వెళ్లి గాలిపటాలు ఎగరవేస్తూ కాలక్షేపం చేశారు. గోకుల్ పార్కు వద్ద మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సంకాంత్రి, కనుమ పండుగలను జరుపుకున్న తర్వాత శనివారం నుంచి తిరిగి నగరానికి ప్రయాణాలు మొదలవుతాయి. సోమవారం నాటికి నగరంలో యథాస్థితి కనిపించే అవకాశం ఉంది.

## కొత్తవలస రైల్వేస్టేషన్‌కు మహర్దశ



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. కేంద్రప్రభుత్వం కొత్తవలస రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించి అభివృద్ధికి సుమారు రూ.18 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో జోరుగా పనులు జరుగుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కొత్తవలస రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. జపాన్ దేశంతో ఉన్న ఒప్పందం ప్రకారం కిరండోల్‌లోని ఐరన్ ఓర్ ఘనులను ఆదేశానికి ఇచ్చి కిరండోల్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయడానికి అప్పట్లో అంగీకారం కుదిరింది. అనంతరం కొత్తవలస కిరండోల్ రైల్వేలైన్ ఏర్పాటైంది. కొత్తవలస రైల్వేస్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. తరువాత కాలంలో విజయనగరం-రాయగడ్ రైల్వే లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొత్తవలస-కిరండోల్‌కు సంబంధించి రెండో రైల్వే లైన్, కొత్తవలస నుంచి విజయనగరానికి మూడో రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొత్తవలస రైల్వే స్టేషన్ ప్రాముఖ్యం పెరగనుంది. గోపాలపట్నం నుంచి కొత్తవలస వరకు ఐదు, ఆరు లైన్‌లు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నారు. కొత్తవలస నుంచి అనకాపల్లి మీదుగా రాజమహేంద్రవరం వరకు మరో రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా కొత్తవలస రైల్వే స్టేషన్‌లో విశాలమైన ఫ్లాట్‌ఫారాలతో పాటు స్టేషన్‌కు సంబంధించి నూతన భవనాలు, ఫ్లాట్‌ఫారాల సంఖ్య పెంపు వంటి చర్యలు చేపట్టారు. కొత్తవలస రైల్వేస్టేషన్‌లో జరిగే అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు డివిజనల్ రైల్వే మేనేజర్ వచ్చి పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలకు ఈ రైల్వే స్టేషన్ ప్రాముఖ్యమైనదిగా మారుతుందని భావిస్తున్నారు.

## రాజ్‌మా రైతులకు గిట్టుబాటు ధర



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో రాజ్‌మాకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లభించింది. ప్రస్తుతం కిలో రూ.85 చొప్పున గిరి రైతుల వద్ద వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. హుకుంపేట, ముంచంగిపుట్టు, గురువారం గుత్తులపుట్టు, మంగళవారం జి.మాడుగుల వారపు సంతల్లో రైతుల వద్ద కిలో రూ.85 చొప్పున వర్తకులు కోనుగోలు చేశారు. గతంలో కిలో రూ.65 నుంచి రూ.75 మాత్రమే ధర ఉండేది. చైనా నుంచి మన దేశానికి రాజ్‌మా గింజలు దిగుమతి కాకపోవడంతో ధర పెరిగిందని రైతులు, వర్తకులు అంటున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనులు 25 వేల ఎకరాల్లో రాజ్‌మా పంటను సాగు చేస్తున్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో 10 వేల ఎకరాల్లో, మిగిలిన మండలాల్లో 15 వేల ఎకరాల్లో రాజ్‌మాను పండిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు కిలో రూ.55 నుంచి రూ.65 ధర మాత్రమే ఉండేది. అయినప్పటికీ గిరిజన రైతులకు రాజ్‌మా సాగు గిట్టుబాటు కావడంతో అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. అయితే జాతీయ మార్కెట్‌లోకి ఇతర దేశాల నుంచి రాజ్‌మా దిగుమతి కావడంతో ధర పెరుగుదలలో కొన్నేళ్లుగా పెద్ద తేడా ఉండేది కాదు. రెండేళ్ల క్రితం భారత్- చైనా సరిహద్దు వివాదం నేపథ్యంలో చైనా ఎగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో రాజ్‌మా గింజల దిగుమతికి బ్రేక్ పడింది. దీంతో దేశీయంగా రాజ్‌మాకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కిలో రూ.85 ధరకు వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా కిలో రూ.80 కంటే ధర తగ్గే అవకాశం లేదని వర్తకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజ్‌మా ధర ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఇద్దరు దొంగలు అరెస్ట్.. రూ.30 లక్షల విలువైన బంగారం స్వాధీనం



**అనంతపురం, పతాకం న్యూస్:** తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసినట్లు శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండ డిఎస్పి తెలిపారు. డియస్పి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డియస్పి నరసింగప్ప తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఈ దొంగలు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. చోరీ కేసులు నమోదు చేసి ప్రత్యేక పోలీసులు బృందం దర్యాప్తు చేపట్టిందన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అనంతపురం కు చెందిన కోటయ్య, శాలి అనే ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు మండలాల్లో చేసిన వరుస చోరీలకు పాల్పడింది వారేనని గుర్తించారు. 8 ఇళ్లలో దొంగతనాలం చేసింది ఈ ఇద్దరే అని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. అనంతరం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరు పర్చారు. చోరీ కేసులను చేదించిన పోలీసులను డిఎస్పి అభినందించారు.

## పురావస్తు శాఖ ఆధ్వర్యంలో రూ.7.5 కోట్లతో బొజ్జన్నకొండ అభివృద్ధి



**తుమ్మపాల, పతాకం న్యూస్:** ప్రముఖ బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండకు సందర్శకులు, పర్యాటకుల రాక ఏటేటా పెరుగుతున్నది. నిత్యం వందలాది మంది బొజ్జన్నకొండను సందర్శిస్తున్నారు. విదేశీయులు, బౌద్ధ భిక్షువులు తరుచూ బొజ్జన్నకొండను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. కొండపై వున్న పురాతన శిలాసంపదను చూసి ఆశ్చర్యపోతున్నారు. ప్రతి ఏటా కనుమ పండుగ రోజున ఇక్కడ బౌద్ధమేళా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించడానికి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నది. బొజ్జన్నకొండకు ఘన చరిత్ర ఉంది. క్రీస్తు శకం నాలుగు-తొమ్మిది శతాబ్దాల మధ్య కాలంలో ఇక్కడ బౌద్ధ ఆరామాలు విరాజిల్లినట్టు చరిత్ర చెబుతున్నది. అయితే 1906-07 సంవత్సరాల్లో అప్పటి బ్రిటీష్ పాలకుల అధికారి అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగే వరకు ఇక్కడ బౌద్ధ ఆరామాలు ఉన్నట్టు బాహ్య ప్రపంచానికి తెలియదు. తవ్వకాల్లో అలనాటి రాజశాసనాలు, నాణేలు, బౌద్ధక్షేత్ర అవశేషాలు బయటపడ్డాయి. ఇక్కడ లభించిన బంగారు నాణేల్లో కొన్ని సముద్రగుప్తుని హయాంలోవి కాగా మరికొన్ని శాతవాహనుల కాలం నాటివని చరిత్రకారులు నిర్ధారించారు. కొండ మొదటి గుహ వద్ద బుద్ధుని నిలువెత్తు స్థూపం ఉంది. బౌద్ధ భిక్షువులు నిత్యం ధ్యానం చేస్తూ బౌద్ధమతం గురించి ఈ ప్రాంతంలో ప్రచారం చేసేవారని చెబుతుంటారు. పక్కనే ఉన్న కొండపై వందల సంఖ్యలో లింగాకార స్థూపాలు ఉన్నాయి. స్థానికులు దీనిని లింగాల కొండగా పిలుస్తుంటారు. కేంద్ర పురావస్తు శాఖ నిర్వహిస్తున్న బొజ్జన్నకొండను నిత్యం ఎంతోమంది సందర్శిస్తుంటారు. కొండపైన, గుహలోపల శిల్ప సంపద, బుద్ధుని విగ్రహాలు, ధాన్య మందిరాలు, బౌద్ధ భిక్షువుల ఆవాసం కోసం పెద్ద పరిమాణంలోగల ఇటుకలతో నిర్మించిన కట్టడాలు ఆకట్టుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.7.5 కోట్లు వ్యయం చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టింది. లేజర్ షో, సౌండ్ అండ్ లైటింగ్ షో, ధ్యాన మందిరం, ముఖద్వారం నిర్మించారు. దీంతో బొజ్జన్నకొండ మరింత ఆకర్షణీయంగా మారింది. బొజ్జన్నకొండకు వెళ్లాలంటే ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాల నుంచి వచ్చే వారు అనకాపల్లి పట్టణం నుంచి చోడవరం రోడ్డులో తుమ్మపాల చేరుకొని, ఇక్కడి నుంచి తూర్పు దిశగా ప్రయాణించాలి. విశాఖ, గాజువాక వైపు నుంచి వచ్చే వారు సుంకరమెట్ట జంక్షన్ వద్ద కుడివైపునకు మళ్లి, సబ్బవరం వైపు వెళ్లే జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ప్రయాణించి, ఏలేరు కాలువ వద్ద ఎడమ వైపునకు మళ్లాలి. ఇక్కడి నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించి బొజ్జన్నకొండకు చేరుకోవచ్చు. ప్రతి ఏటా కనుమ పండుగ రోజున బొజ్జనకొండ వద్ద బౌద్ధ మేళా నిర్వహిస్తుంటారు. ఇందుకోసం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరగనున్నాయి. కొండపై ప్రత్యేక ప్రార్థనలు, శాంతిర్యాలీ, బుద్ధుని ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. దేశ, విదేశాల నుంచి బౌద్ధ భిక్షువులు హాజరవుతారు. కొండదిగువున ఉన్న మైదానంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ ఎత్తున బొజ్జన్నకొండ తీర్థం జరుగుతుంది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇటీవల బొజ్జన్నకొండ ప్రాంతాన్ని పరిశీలించి బౌద్ధమేళా, తీర్థం ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## గ్రామాలే ఆనందానికి నిలయం



**పాతపట్నం, పతాకం న్యూస్:** గ్రామాలే స్వచ్ఛతకు పరిపూర్ణమైన ఆనంద నిలయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మండల పరిధిలోని సీది గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలను తిలకించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ వేదికలుగా నిలిచే పర్వదినాలు ఉత్సాహంగా నిర్వహంచుకోవాలన్నారు. ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కూటమి నాయకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## గ్రామ ముఖద్వారం ప్రారంభం



**వీరఘట్టం, పతాకం న్యూస్:** ఎం.రాజపురం గ్రామ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఏర్పాటు చేశారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ముఖ ద్వారాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, కర్నేన అప్పలనాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, తూముల రమేష్, చింతా ఉమా, గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మన్యానికి పండుగ కళ.. కళకళలాడుతున్న గ్రామాలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** 'మన్యం'లో పండుగ కళ తొణికిసలాడుతోంది. అందరి లోనూ సంక్రాంతి జోష్ నెలకొంది. పెద్దల పండుగను వైభవంగా జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తమ పూర్వీకులను పూజించి ఆపై కొత్త దుస్తులతో ముస్తాబవ్వాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఇప్పటికే చుట్టాలు, బంధువులు, స్నేహితులతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. చిన్నారులు సందడి చేస్తున్నారు. యువకులు కేరింతలు కొడుతున్నారు. ఆటలు, పాటలతో ఆకట్టుకుంటున్నారు. గాలిపటాలు ఎగరేస్తున్నారు. యువతులు ముంగిళ్లకు రంగురంగుల రంగవల్లులతో కొత్తదనాన్ని తీసుకొచ్చారు. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి సంప్రదాయాలను అనుసరించారు. మరోవైపు సంక్రాంతి చుట్టాలుగా ప్రతి ఇంటికీ వచ్చే హరిదాసులు, దూడూ బసవన్నల హడావుడి అంతా ఇంతా కాదు. వీరిని అందరూ అనుసరిస్తూ సెల్ఫీలు దిగుతున్నారు. కాగా పార్వతీపురం, పాల కొండ, సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ కిటకిటలాడాయి. త్వరగా స్వగ్రామాలకు చేరుకో వాలన్న ఉత్సాహం ప్రయాణికుల్లో కనిపించింది. పండుగకు కావాల్సిన పిండివంటల సామగ్రి, పూజా సామాన్ల కొనుగోలుతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. దుస్తుల షాపులది మరింత ప్రత్యేకం. జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల్లో వస్త్ర వ్యాపారం జరిగింది. కోడి పందేలు కూడా గుట్టుగా జరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా పందేలు జరిగే స్థలం నిర్ణయించుకుంటున్నారు. పందేలకు దిగేవారు

## చింతపల్లి పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు అవస్థలు



**చింతపల్లి, పతాకం న్యూస్:** చింతపల్లి పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పాత బస్టాండ్‌లో బస్ షెల్టర్ ఒక చోట ఉండగా, బస్సులు మరో చోట ఆగుతున్నాయి. దీంతో గంటల తరబడి ప్రయాణికులు నిల్చొనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే పాత బస్టాండ్‌లో మరుగుదొడ్లు మరుగునపడిపోయాయి. దీని వలన ప్రయాణికులు మల, మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చింతపల్లి మీదుగా సీలేరు, భద్రాచలం, పాడేరు, కొయ్యూరు, జీకేవీధి, అరకులోయ, నర్సీపట్నం ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు సర్వీసు వాహనాలు అత్యధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు చింతపల్లి మీదుగా ప్రయాణిస్తుంటారు. దీనికి తోడు చింతపల్లి వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణానికి పాత బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. చింతపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఉన్నప్పటికి కిలోమీటరు దూరంలో ఉన్న పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ దుకాణాలు ఉన్నాయి. అలాగే ప్రతి ఆర్టీసీ బస్సు పాత బస్టాండ్ నుంచి వెనుదిరుగుతుంది. దీంతో సీట్లు రిజర్వు చేసుకునేందుకు సైతం ప్రయాణికులు పాత బస్టాండ్‌లోనే నిరీక్షిస్తుంటారు. పాత బస్టాండ్‌లో గ్రంథాలయానికి సమీపంలో బస్ షెల్టర్ ఉంది. అయితే ఆర్టీసీ బస్సు ఒక్కటీ షెల్టర్ వద్ద ఆగదు. బస్సులన్నీ పాత బస్టాండ్ ఏరియా ఆస్పత్రికి ఎదురుగా ఉన్న రహదారిపైన ఆగుతున్నాయి. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు పాత బస్టాండ్ ఏరియా ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నిల్చొని నిరీక్షిస్తున్నారు. కొంత మంది దుకాణాల వద్ద కూర్చొని బస్సు వచ్చే వరకు వేచి వుంటున్నారు. ఏరియా ఆస్పత్రికి వంద అడుగుల దూరంలో బస్ షెల్టర్ ఉండడం, ఆర్టీసీ డ్రైవర్లు బస్ షెల్టర్ వద్ద ఆపకపోవడం వల్ల ప్రయాణికులు దానిని వినియోగించడం లేదు. ప్రస్తుతం పాత బస్టాండ్ వద్ద షెల్టర్ అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నది. బస్ షెల్టర్‌ను ప్రయాణికులు వినియోగించకపోవడం వల్ల ప్రైవేటు వ్యక్తులు వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు.

పాత బస్టాండ్‌లో షెల్టర్ పక్కనే పంచాయతీ నిధులతో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. అలాగే బోరు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలను ఆర్టీసీ అధికారులు గాని, పంచాయతీ సిబ్బంది గాని పట్టించుకోకపోవడం వల్ల నిరుపయోగంగా వున్నాయి. ప్రస్తుతం మరుగుదొడ్లు మల, మూత్ర విసర్జనకు అనుకూలంగా లేవు. డోర్లు సైతం ఊడిపోయాయి. ఆర్టీసీ బస్సులు, సర్వీసు వాహనాలు పాత బస్టాండ్‌కు వచ్చి వెనుదిరుగుతాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు పాత బస్టాండ్‌లో దిగి మల, మూత్ర విసర్జనకు మరుగుదొడ్ల వద్దకు వెళ్లినప్పటికి వినియోగంలో లేకపోవడం వల్ల వెనుదిరగాల్సి వస్తుంది. పురుషులు పాత బస్టాండ్ దుకాణాల వెనుకవైపు, ఖాళీ స్థలాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. మహిళలైతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## డ్రోన్ కెమెరాలతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ



**కడప, పతాకం న్యూస్:** నగరంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల సేవనం, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వై.ఎస్.ఆర్ కడప ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, కడప డి.ఎస్.పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, కడప వన్ టౌన్ సి.ఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్న అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నింగి నుంచి నిఘా ఉంచుతూ, నేలపై పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి అనుమానితులను జల్లెడ పడుతూ గుర్తించే చర్యలు తీసుకుంటున్నారు. అనుమానిత ప్రాంతాల నుంచి పారిపోతున్న వ్యక్తులను డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించి పట్టుకుని, వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## జీడిపంటపై సన్నగిల్లుతున్న ఆశలు



**పలాస, పతాకం న్యూస్:** ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో జీడిమామిడి పంటకు ఊపిరి పోసినట్లయింది. రైతులు ఆశించినట్టుగానే పూత కూడా బాగుంది. తితలీ తుఫాన్ తరువాత... దాదాపు ఏడేళ్ల తరువాత తొలిసారిగా జీడి పూత రైతుల్లో ఆశలు రేకెత్తించింది. కానీ ఆ ఆశలపై పొగమంచు నీళ్లు చల్లుతోంది. పొగమంచు కారణంగా జీడి పూత మాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నెల రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే మొత్తం పంటంతా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు బెంగ పడుతున్నారు. అధిక శాతం జీడితోటల్లో పిక్కలు గుత్తులుగా కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా దిగుబడి లేక అవస్థలు పడిన రైతులు ఈ ఏడాదైనా ఎంతో కొంత పంటను కళ్ల చూడవచ్చని ఆశతో ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలు లేకపోతే విదేశీ పిక్కలపై ఆధారపడకుండా మన అవసరాలకు ఉద్దానం పంట సరిపోతుందని భావించారు. ఇంతలో రాత్రంతా పొగమంచు... మధ్యాహ్నం తీవ్ర ఎండ వల్ల జీడి పూవు కాలిపోయినట్లుగా నల్లగా మారి... రాలిపోతోంది. ఈ ప్రాంతంలో వరి పంట బాగా పండితే అదే ఏడాది జీడి కూడా పండుతుందని రైతుల నమ్మకం. సరాసరి ఎకరాకు 80 కిలోల బస్తాలు నాలుగు నుంచి ఆరు వరకు పండుతాయి. 2018 తితలీ తుఫాను ఉద్దానం గతినే మార్చేసింది. మొత్తం జీడి పంటంతా తుఫానుకు కొట్టుకుపోయింది. వేర్లు బయటకు రావడంతో చెట్లు దెబ్బతిన్నాయి. సుమారు రెండేళ్ల నుంచి కొత్త, పాత మొక్కలు కాపుకాసి ఆదాయాన్ని తెస్తున్నాయి. అవి కూడా అంతంతమాత్రంగానే. జిల్లాలో మొత్తం 34వేల హెక్టార్లల్లో జీడి పంట సాగవుతోంది. ఉద్దానం ప్రాంతంలో ఎర్రనేలల్లో జీడికి అనుకూలంగా ఉండడంతో అధిక శాతం రైతులు దీనిపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు ఏటా జిల్లాలో పండే పంట సరిపోకపోవడంతో విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి జీడి పిక్కలు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న జీడి పరిశ్రమలకు మన పంట కేవలం 20 శాతం మాత్రమే అందుతోంది. మిగిలిన 80 శాతం పిక్కలను వేర్వేరు మార్గాల ద్వారా రప్పించుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది విడవకుండా పొగమంచు కురుస్తుండడంతో ఉద్దానం జీడి పిక్కలపై వ్యాపారులు ఆశలు పెట్టుకోకుండా ఇతర ప్రాంతాల ద్వారా జీడి పిక్కల కొనుగోలుకు అప్పుడే చర్యలు ప్రారంభించారు. వాస్తవానికి విదేశీ పిక్కల కన్నా ఉద్దానం పిక్కలు మంచి దిగుబడితో పాటు రుచిలో కూడా బాగుంటాయి. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు జిల్లా జీడి పిక్కలు కొనుగోలు చేయడానికి ఉత్సాహం చూపిస్తుంటారు. గాలి, వెలుతురు ఉన్న జీడితోటల్లో ఎకరాకు 8 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ పొగమంచు దెబ్బకు జీడిపంట పూత దశలోనే రాలుతోంది. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని...పంట దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## 20 నుంచి విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

**కర్నూలు, పతాకం న్యూస్:** విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) ఈనెల 20వ తేదీ నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ ఊ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 -- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఈఆర్సీ చైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి అధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలులో నిర్వహించనున్న ట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) పై ఈనెల 20వ తేదీన తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ, 27న కర్నూలులోని ఏపీఈఆర్సి కార్యాలయంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్కో, ఏపీజెన్కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసిపిడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి రోజూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించిన ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారని వివరించారు. అభిప్రాయాలు తెలియజేయదలుచుకున్న వారు నేరుగా ఆయా వేదికల వద్ద పాల్గొనవచ్చని, నేరుగా పాల్గొనలేని వారికోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

# పందెం గెలిచింది .. కోటిన్నర తెచ్చిపెట్టింది ..



**ఉభయ గోదావరి జిల్లాలు, పతాకం న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సందడి కొనసాగుతోంది. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాల్లో రెండో రోజూ కోళ్లు కత్తులు దూశాయి. కాయ్ రాజా కాయ్ అంటూ నిర్వాహకులు పిలుస్తుంటే బరుల వద్ద పందెంరాయుళ్లు కరెన్సీ నోట్లు వెదలజల్లారు. కోట్ల కోట్ల రూపాయలు చేతులు మారాయి. సొంతూళ్లకు వచ్చిన వారు కుటుంబ సమేతంగా వెళ్లి కోడిపందేలను ఆసక్తిగా వీక్షించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో బరిలో నిలిచిన ఓ కోడి తన యజమానిని కోటీశ్వరున్ని చేసింది. ఆరు నెలల పాటు బలవర్ధకమైన ఆహారం పెట్టి పోషించి నమ్మకంలో బరిలో నిలపగా ప్రత్యర్థిపై కత్తులు దూసింది. యమా రంజుగా సాగిన పోరాటంలో విజేతగా నిలిచింది. తాడేపల్లిగూడెంలోని పైబోయిన వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరిలో ఈ ఘటన జరిగింది. గుడివాడకు చెందిన ప్రభాకర్ కు చెందిన సేతువ రకం కోడి రాజమండ్రికి చెందిన రమేష్ డేగ రకం కోడితో తలపడింది.

హెూరాహెూరీ పోటీలో రమేష్‌కు చెందిన కోడి గెలిచి తన యజమానికి అక్షరాల కోటి 53 లక్షల రూపాయలు తెచ్చి పెట్టింది. కంటికిరెప్పలా కాపాడుకున్న తన కోడి సాధించిన విజయంతో ఆ యజమాని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బరిలో విజేతగా నిలిచిన అతన్ని స్థానికులు స్నేహితులు భుజాన ఎత్తుకుని కేకలు వేస్తూ అభినందించారు.

జాతరను తలపించిన కోడిపందేలు: ఉమ్మడి గోదావరి జిల్లాలో కోడిపందేల జోరు కొనసాగింది. డాక్టర్ దీ=అంబేద్కర్ కోనసీమజిల్లాలో రెండోరోజూ కోడిపందేలు జోరుగా సాగాయి. మురమళ్లలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరులు జాతరను తలపించాయి. వాహనా రద్దీ నియంత్రణకు పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో స్థిరపడినవారూ వచ్చి పందేల్లో పాల్గొన్నారు. రావులపాలెంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, జనసేన నేత బండారు శ్రీనివాస్ పందేలను తిలకించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలో కోడిపందేలతోపాటు.. గుండాటలూ జోరుగా సాగాయి. బరుల వద్ద మహిళలు కూడా సందడి చేశారు. చేబ్రోలు వద్ద కోడి పందేల్ని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు వీక్షించారు. హైదరాబాద్ సహా తెలంగాణ ప్రాంతం నుంచీ సందర్శకులు ఇక్కడి పందేలను ఆస్వాదించారు. ఏలూరు జిల్లా వీరవాసరం మండలం నవుడూరు బరి తిరునాళ్లను తలపించింది. బరి చుట్టూ పెద్ద సంఖ్యలో కార్ల బారులు కనిపించాయి. ఇక్కడ పందేల్లో నగదు పెద్ద సంఖ్యలో చేతులు మారింది.

# అందుబాటులోకి వచ్చిన విజయవాడ వెస్ట్ బైపాస్



**విజయవాడ, పతాకం న్యూస్:** ప్రజలకు విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి అందుబాటులోకి వచ్చింది. మంగళగిరి మండలం కాజా నుంచి కృష్ణాజిల్లా పెద్దఅవుటుపల్లి వరకు నిర్మించిన రహదారిని ఒకవైపు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఈ రహదారిని ప్రారంభించారు. ముందుగా నేషనల్ హైవే అథారిటీ అధికారుల వాహనాలు రహదారి పైకి ప్రవేశించాయి. అనంతరం ఇతరుల వాహనాలను అనుమతించారు. మార్చిలోపు రెండు వైపులా రహదారులను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెప్పారు. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఇంకా విజయవాడలోకి రాకుండా నేరుగా రాజధానిలోకి వెళ్లేలా అవకాశం కల్పించామన్నారు. పూర్తిస్థాయి రహదారి అందుబాటులోకి వచ్చిన తర్వాతే వెంకటపాలెం వద్ద టోల్ ఫీజు వసూలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

గుంటూరు, చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలు కాజా టోల్‌గేట్ దాటిన తర్వాత వెస్ట్ బైపాస్‌లోకి వచ్చి గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు వెళ్తాయి. అక్కడ నుంచి ఏలూరు వైపు హైవేలోకి చేరుకొని వెళ్లిపోవచ్చు. ఇప్పటికే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. కాజా వైపు నుంచి వచ్చే వాహనాలు నేటి నుంచి నేరుగా ఏలూరువైపు వెళ్లొచ్చు. అలాగే గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్‌లో గొల్లపూడి వద్ద విజయవాడ-హైదరాబాద్ హైవేలోకి చేరుకొని అక్కడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లిపోవచ్చు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాల్లో హైదరాబాద్, ఏలూరు వెళ్లే వాహనాలేవీ విజయవాడ నగరంలోకి రావాల్సిన అవసరం ఉండదు.

గొల్లపూడి శివారులో విజయవాడ-హైదరాబాద్ హైవే నుంచి కృష్ణానదిపై వంతెన దాటి సీడ్ యాక్సెస్ రోడ్, వెంకటపాలెం, పాలవాగు మీదుగా కొత్తగా నిర్మించే టోల్‌ప్లాజా దాటాక (పెనుమాక-కృష్ణాయపాలెం-మందడం) ఇ-8 రోడ్‌లో కలిసే వరకు బైపాస్ పనులు పూర్తి చేశారు. దీనివల్ల ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, హైదరాబాద్? వైపు నుంచి సులువుగా రాజధాని ప్రాంతానికి రాకపోకలు సాగించవచ్చు. అయితే ప్రస్తుతం ఈ వెస్ట్ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం కాజా వరకు వచ్చేందుకు అవకాశం లేదని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. మధ్యలో కొన్ని చోట్ల బైపాస్‌లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఆ వాహనాలు ప్రస్తుతం అనుమతి ఉన్నట్లే గొల్లపూడి వైపు నుంచి వచ్చేటప్పుడు కృష్ణా నదిపై వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత మంగళగిరి-మందడం రోడ్డులోకి చేరుకొని హైకోర్టు, సచివాలయం వైపు వెళ్లొచ్చని పేర్కొన్నారు. పూర్తిస్థాయి బైపాస్? రహదారి అందుబాటులోకి వచ్చిన తర్వాతే వెంకటపాలెం వద్ద టోల్‌ఫీజు వసూలు చేస్తామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ ప్యాకేజీ 03లో భాగంగా గొల్లపూడి నుంచి పెదఅవుటపల్లి వరకు రహదారికి ఇరువైపులా ఉండాల్సిన సర్వీస్ రోడ్లు మంజూరు చేయలేదని గతంలో ఎంపీ చిన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ రహదారి గ్రామీణ ప్రాంతాలను విజయవాడకి, రాజధాని ప్రాంతానికి సైతం కలిపే అనుసంధానంగా మారబోతున్నందున, సర్వీస్ రోడ్లు లేకపోతే ప్రమాదాలు అధికంగా పెరుగుతాయని ఎంపీ కేంద్ర మంత్రికి తెలిపారు. గ్రామీణులు వ్యవసాయానికి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఇతర వాహనాలను వినియోగిస్తుంటారనీ, వాటిపై జాతీయ రహదారిపైకి వస్తే ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉందన్నారు. సర్వీస్ రోడ్లను నిర్మిస్తే వాళ్లు జాతీయ రహదారిపైకి రాకుండా పక్కనుంచి వెళ్లిపోతారని తెలిపారు.

# అసంపూర్తిగా పిచ్చిమొక్కల మధ్య నిలిచిన సచివాలయం భవన నిర్మాణం

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** నందిగాం మండలంలోని పెద్ద బాణాపురం గ్రామ సచివాల యానికి సంబంధించి భవనాల నిర్మాణాలు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. పనులు నిలిచిపోవడంతో జనసంచారంలేక పిచ్చిమొక్క లతో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పంచాయతీ భవనంలోని ఇరుకు గదిలోనే సచివాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్దబాణాపురం, ఆనందపురం పంచాయతీలు కలిపి సచివాలయంగా ఏర్పాటుచేశారు. దీంతో గ్రామ సచివాలయంతోపాటు వెలెనెస్ సెంటర్, రైతుసేవా కేంద్రాల భవనాలు మం జూరయ్యా యి. సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, రైతు సేవా కేంద్రానికి రూ.21లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.15లక్షలు చొప్పున్న ఉపాధి హామీపథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఈ సచివాలయం నిర్మాణంలో కాంట్రాక్టరు ముఖం చాటేయడంతోపాటు ప్రభుత్వం మారిపోవడంతో పునాది స్థాయిలోనే ఆయా భవనాలు నిలిచిపోయాయి. దీనికితోడు పర్య వేక్షణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొ దలతో నిండి దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సచివాలయం సేవలు స్థానిక పంచాయతీ భవ నంలో చాలీచాలని వసతి మధ్య నిర్వహిస్తున్నారు. దీంతో విధులు



నిర్వహణకు సిబ్బంది తోపాటు పనులపై వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. వెల్‌నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రం పరాయిపంచలో కొనసాగుతున్నాయి. అయితే వైసీపీ హయాంలో ప్రారంభించిన పనుల మేరకు బిల్లులు చెల్లింపు జరిగాయి. ప్రభుత్వం మారడంతో బిల్లులు కావన్న అను మానంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. కాగా భవనాలు అసంపూర్తిగా మిగల డంపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామని, తదుపరి సూచనలు మేరకు చర్యలు చేపడతామని మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్‌కుమార్ తెలిపారు.

# ధరలు ఉన్నా దిగుబడులు లేవు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** వర్షాలు, ప్రకృతి విపత్తులతో అరటి రైతులు నిండా మునిగిపోయారు. దక్కిన కాస్త పంటకు టన్ను రూ. ఐదు వేలు పలకడంతో మరింత నిరాశకు గురయ్యారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో కొంతమంది రైతులు పంటను తొలగించారు. మరికొందరు అరటి గెలలను రోడ్డు పక్కన పడేశారు. ప్రస్తుతం పండుగ సీజన్లు కావడంతో కాస్తంత ధర పెరిగినా దిగుబడి లేదు. ఇతర రాష్ట్రాల్లో ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకూ హెూల్‌సేల్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీ పేట మండలాల్లో విస్తారంగా అరటి సాగుచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి తదితర మండలాల్లో కలిపి అధికారిక గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 వేల ఎకరాల్లో అరటి సాగవుతుంది. రావులపాలెం మార్కెట్ నుంచి ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కలకత్తా తదితర రాష్ట్రాలకు ప్రతి రోజూ 80 లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో సుమారు 150కి పైగా లారీలు, ఇతర వాహనాలతో అరటి ఎగుమతి అవుతోంది. రావులపాలెం, ఆత్రేయపురం అరటికి మంచి డిమాండ్ ఉంటుంది. సైజు, లావు, నాణ్యతతో పాటు రుచి, సువాసన కలిగి ఉంటాయి. ప్రధానంగా కర్పూరం, తెల్ల చక్రకేళి, బుసావళి ఎర్ర చక్రకేళి, తదితర రకాల అరటిని రైతులు సాగు చేస్తున్నారు.

గతేడాది మొంథా తుపాను అరటి పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈదురుగాలులకు కొన్ని చెట్లు నేలవాలగా, వర్షాలకు తెగుళ్లు దాడి చేశాయి. జిల్లాలోని 45 వేల ఎకరాలకు సుమారు ఎనిమిది లక్షల టన్నుల అరటి దిగుబడి వచ్చేది. తుపాను ప్రభావంతో ఈ ఏడాది 6.75 లక్షలకు పడిపోయింది. వాతావరణ పరిస్థితులు బాగుంటే ఎకరాకు 15 టన్నుల నుంచి 20 టన్నుల అరటి దిగుబడి వచ్చేంది. కాని ప్రస్తుతం ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. తాజాగా డిమాండ్‌కు తగినట్లుగా దిగుబడి లేకపోవడంతో ధరలు పెరిగినా పెద్దగా లాభం లేదని రైతులు అంటున్నారు.

# 'వందేభారత్'కు ఆరెంజ్ రంగు



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతి-సికింద్రాబాదు వందేభారత్ రైలు ఇప్పుడు ఆరెంజ్ కలర్‌లో రాకపోకలు సాగిస్తోంది. ఈ రైలును 2023 ఏప్రిల్ 9న ప్రారంభించారు. కొన్ని నెలలపాటు 8 బోగీలతో నడిచింది. ప్రయాణికుల ఆదరణ ఉండటంతో 16 బోగీలకు పెంచారు. మళ్లీ డిమాండ్ పెరగడంతో 20 బోగీలకు పెంచేశారు. కొత్తగా ఆరెంజ్ రంగులో 20 బోగీల రైలుగా మారింది. ఇందులో 1,440సీట్ల సామర్థ్యం ఉంది. తిరుపతి మీదుగా రాకపోకలు సాగించే అతిపెద్ద రైళ్లలో ఇదొకటి. కాగా, 102 వందేభారత్ రైళ్లలో ఈ రైలు మాత్రమే ప్రత్యేకంగా ఆరెంజ్ రంగులో నడుస్తుండడం విశేషం. గతంలో తెలుపురంగులో ఉంది.

# తొలగించిన మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు




**ఒంగోలు, పతాకం న్యూస్:** ఒంగోలు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులపై అసభ్యపదాలు ప్రయోగిస్తూ భౌతికదాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. మున్సిపల్ అధికారులు ఏకపక్ష నిర్ణయాలతో విధుల నుంచి తొలగించిన యూనియన్ నాయకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నగరపాలక పారిశుద్ధ్య మస్టర్ పాయింట్ల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ బెదిరింపులు, దాడులకు పాల్పడటం అన్యాయమని అన్నారు. యూనియన్ కార్యకలాపాలను అణిచివేయాలనే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి. కల్పన మాట్లాడుతూ మహిళా కార్మికులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి. శ్రీనివాసులు నగర నాయకులు టి. మహేష్, యూనియన్ నాయకులు కే. శ్రీనివాసరావు, ఆర్. శ్రీనివాసరావు, జి. నరసింహ, ఆనంద్, యు. రత్నకుమారి, సంతోషం, కసుకుర్తి వెంకటేశ్వరరావు, సాల్మన్ పిచ్చయ్య, మోహన్ రావు, రవి బాబు తదితరులు పాల్గొన్నారు.

# తరచూ కాళ్లలో 'తిమ్మిర్లు' వస్తున్నాయా?



ఎక్కువ సేపు ఒకే భంగిమలో కూర్చున్నప్పుడు లేదా పడుకున్నప్పుడు కాళ్లలో తిమ్మిర్లు రావటం లేదా కండరాలు పట్టేస్తుంటాయి. అలా జరిగినపుడు లేచి కాస్త అటుఇటు నడవగానే తిమ్మిర్ల బాధలు తొలగిపోతుంటాయి. అయితే, కొంతమందిలో కూర్చునే, పడుకునే భంగిమలతో నిమిత్తం లేకుండానే ఈ సమస్య వస్తుంటుంది. ఈ సమస్యను డీహైడ్రేషన్ లేదా అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ, ఇది శరీరంలో ఉన్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఎలాంటి ఆరోగ్య సమస్యల కారణంగా కాళ్లలో తిమ్మిర్లు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం!

నడుస్తున్నప్పుడు కాళ్లు పట్టేసి, ఆగగానే తగ్గిపోతుంటే అది రక్తనాళాల్లో అడ్డంకుల వల్ల కావచ్చు. ఈ సమస్య ఉన్నవారిలో కాళ్లలో తిమ్మిర్లు రావడం ఒక ప్రధాన లక్షణం. రక్త నాళాల్లో కొవ్వు నిల్వలు (ప్లేక్) పేరుకుపోవడం వల్ల కాళ్లకు రక్త ప్రసరణ తగ్గి, కండరాలకు తగినంత ఆక్సిజన్ అందకపోవడమే ప్రధాన కారణమని ఎశ్రీవజవశ్రీఖఅసఎశ్రీఅఅఅష అధ్యయనం పేర్కొంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం లేదా కాలు తీసివేయాల్సిన పరిస్థితి రావచ్చు.

ఈ సమస్య వల్ల కాళ్లు బరువుగా లేదా తిమ్మిర్లుగా అనిపించడం, నిలబడినప్పుడు తీవ్రమయ్యే నొప్పి వస్తుందని ఎవసశ్రీఅవజూశ్రీబం అధ్యయనం పేర్కొంది. సిరల్లోని కవాటాలు సరిగ్గా పనిచేయనప్పుడు, రక్తం గుండెకు తిరిగి ప్రవహించలేక కాళ్లలోనే నిలిచిపోతుంది. దీనివల్ల రక్త ప్రసరణ మందగించి, నరాలపై ఒత్తిడి పెరగడం వల్ల తిమ్మిర్లు లేదా జలదరింపు అనుభూతి కలుగుతుందంటున్నారు నిపుణులు.

శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత దెబ్బతినడం వల్ల కాళ్లలో తిమ్మిర్లు, జలదరింపు, కండరాలు పట్టేయడం వంటి సమస్యలు వస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, మెగ్నీషియం, పొటాషియం లేదా క్యాల్షియం స్థాయిలు తగ్గినప్పుడు కండరాలు సరిగ్గా పనిచేయవని ఎవసశ్రీఅవజూశ్రీబం అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా మూత్ర విసర్జన మందులు వాడేవారిలో ఇది కనిపిస్తుందట.

సయాటికా, న్యూరోపతి లేదా వెన్నెముకపై ఒత్తిడి వల్ల కూడా కాళ్లు పట్టేయవచ్చు. కండరాల నొప్పి కంటే మంట, తిమ్మిర్ల వంటి అనుభూతి కలిగితే అది నరాల సమస్య కావచ్చంటున్నారు నిపుణులు. ఎందుకంటే, నరాలు దెబ్బతిన్నప్పుడు లేదా వాటిపై ఒత్తిడి కలిగినప్పుడు మెదడుకు అందే సంకేతాలలో అంతరాయం కలిగి, తిమ్మిరి లేదా జలదరింపుగా అనిపిస్తుంది.

స్టాటిన్స్, ఆస్తమా మందులు, యాంటీ డిప్రెసెంట్స్ వంటి కొన్ని రకాల మందులు వాడటం వల్ల కూడా కాళ్లలో తిమ్మిర్లు రావచ్చు. కొత్త మందులు మొదలుపెట్టిన తర్వాత ఇలా జరిగితే డాక్టర్లను సంప్రదిం చాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువ సేపు నిలబడి పనిచేయడం, కఠినమైన వ్యాయామాలు, సరైన నిద్ర లేకపోవడం వల్ల కండరాలు బిగుసుకుపోయి నొప్పి వస్తుందం టున్నారు నిపుణులు. థైరాయిడ్ సమస్యలు, రక్తహీనత, విటమిన్ బి12, డి లోపం వల్ల కండరాలు త్వరగా అలసిపోయి తిమ్మిర్లు వస్తాయి. బి12 లోపం వల్ల పాదాల్లో సూదులతో పొడిచినట్లు తిమ్మిరిగా లేదా జలదరింపుగా అనిపిస్తుం

# కళ్లు అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే..



ఈ డిజిటల్ కాలంలో ఎలక్ట్రిక్ గాడ్జెట్స్ లేకుండా రోజు గడవటం కష్టమమే. కంప్యూటర్/ మొబైల్‌కు గంటల తరబడి చూస్తూ ఉండ టంతో.. కంటి సమస్యలు ఎక్కువయ్యాయి. ఒకప్పుడు వయసు మీద పడిన తర్వాత.. కళ్లకు అద్ధాలు వచ్చేవి. ప్రస్తుతం చిన్న వయస్సులోనే కంటి సమస్యలు వస్తున్నాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మనకు కళ్లు సరిగ్గా కనిపిస్తేనే.. ఏ పనైనా సరిగ్గా చేయగలం. కానీ, ఈ డిజిటల్ కాలంలో ఎలక్ట్రిక్ గాడ్జెట్స్ లేకుండా రోజు గడవటం కష్టమమే. కంప్యూటర్/ మొ బైల్‌కు గంటల తరబడి చూస్తూ ఉండటంతో.. కంటి సమస్యలు ఎక్కువయ్యాయి. ఒకప్పుడు వయసు మీద పడిన తర్వాత.. కళ్లకు అద్దాలు వచ్చేవి. ప్రస్తుతం ఒత్తిడి, పోషక ఆహార లోపం, ఎలక్ట్రిక్ గాడ్జెట్స్ కారణంగా.. చిన్న పిల్లలకు స్పెట్స్ వస్తున్నాయి. మన కంటిని ఆరోగ్యంగా ఉంచుకోవడం, కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తగా ఉండటం చాలా అవసరం. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుంటూ, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

రోజులో ఓ 10నిమిషాలు కళ్ల కోసం సమయం కేటాయించి చిన్నపాటి వ్యాయమం చేస్తే.. కంటి సమస్యలు రావు. ముందుగా రిలాక్స్‌గా కూర్చోవాలి. రెండు కళ్లను పెద్దవిగా చేసి, తల కదిలించకుండా కను గుడ్లను మాత్రమే కుడి నుంచి ఎడమకు.. ఎడమ నుంచి కుడికి.. అలాగే, పై నుంచి కిందకు.. కింద నుంచి పైకి మెల్లగా తిప్పుతూ ఉండాలి. తర్వాత కనుగుడ్లను కంటిలోపలి చివరంచుల వరకూ తీసుకెళ్తూ.. తిప్పాలి. మళ్లీ వ్యతిరేక దిశలో తిప్పాలి. ఇలా 10నుంచి 20సార్లు చేయాలి. ఇలా చేయడం వల్ల కంటిలోని రక్తనాళాలు యాక్టివ్ అవుతాయి. కళ్లలో రక్తప్రసరణ మెరుగ్గా జరుగుతుంది.

20-20-20 రూల్ పాటిస్తే.. కళ్లు ఆరోగ్యాంగా ఉంటాయి. ప్రతి ఇరవై నిమిషాలకోసారి ఇరవై సెకన్ల విరామం తీసుకోండి. ఆ సమయంలో 20 మీటర్ల దూరంలో ఉన్న వస్తువుపై మీ దృష్టిని పెట్టండి. లేదా గంటకు అయిదు నిమిషాల పాటు మీ కళ్లకు తగినంత విశ్రాంతినివ్వండి. విశ్రాంతి తీసుకొనే సమయంలో కళ్లను సవ్య, అపసవ్య దిశల్లో గుండ్రంగా తిప్పాలి. లేదంటే కళ్లను మూసి ఉంచాలి.

ప్రతీరోజూ బ్లూ లైట్‌ని ఎక్కువగా చూడటం వల్ల కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కంప్యూటర్- విజన్ సిండ్రోమ్, డిజిటల్ ఐ స్ట్రైన్ సమస్యలకు దారితీస్తుంది. కంప్యూటర్, టీవీ, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్స్ వంటి డిజిటల్ పరికరాలు వాడేసమయంలో కచ్చితంగా యాంటీ-రిఫ్లెక్టివ్ కోటింగ్ అద్దాలు వాడాలని నిపుణులు చెబుతున్నారు. విటమిన్ 'ఎ' మీ ఆహారంలో ఎక్కువగా ఉండేలా చూసుకోండి. ఇందులో ఉండే రెటినాల్, బీటా కెరోటిన్ కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. క్యారెట్, ఆకుకూరల్లో ఈ విటమిన్ 'ఎ' పుష్కలంగా లభిస్తుంది. ఆకుకూరలు కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే సాల్మన్, ట్యూన్, సార్డినెస్, ట్రౌట్, మ్యాకరెల్ చేపలను ఎక్కువగా తినాలి. వీటితో పాటు వాల్‌నట్స్, బాదం, అరటి పండ్లు, ఎండు ద్రాక్ష, అవకాడోలను రెగ్యులర్‌గా తీసుకోవాలి. ప్రతి రోజూ 8 నుంచి 10 గ్లాసుల వాటర్ తాగాలి. అప్పుడే మన శరీరంలో కావలసినంత తేమ ఉంటుంది. దీనివల్ల కళ్లు కూడా పొడిబారకుండా ఉంటాయి.

# గిరిజనులపై 'సోలార్' పిడుగు

## సోలార్ కంపెనీకి ఆదివాసీల సాగు భూములు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నలావలస గ్రామంలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్ సర్వేతో గిరిజనులపై పిడుగు పడినట్లయింది. దీనికి వ్యతిరేకంగా గిరిజనుల ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. తరతరాలుగా అడవులు, వ్యవసాయం, వాగులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు ఈ ప్రాజెక్ట్ వల్ల తమ జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుబుజ్జిలి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌పై ప్రభుత్వం ఇటీవల కాలంలో పలురకాల సర్వేలు నిర్వహించింది. వెన్నెలవలసలోని నవోదయ స్కూల్‌లో ఒకసారి, రహదారుల వెడల్పు పేరుతో మరోసారి నిర్వహించిన సర్వేలు అడవి బిడ్డలను బెంబేలెత్తిస్తున్నాయి. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా సర్వే కోసం డ్రోన్‌లు ఎగురవేస్తుండడంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా ఈ నెల ఐదో తేదీన సోలార్ పవర్ ప్యానల్స్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని చూపించడానికి వచ్చిన రెవెన్యూ అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. సోలార్ పవర్ ప్యానల్స్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టద్దని తేల్చిచెప్పారు.

శ్రీకాకుళం జిల్లాలో పిఎం కుసుమ్ (ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవమ్ ఉత్తాన్ మహాభియాన్) పథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి గృహ, వ్యవసాయ అవసరాలకు కరెంట్ సరఫరా చేసేందుకు గతేడాది జూలైలో పలు ప్రాంతాలను అధికారులు ఎంపిక చేశారు. అందులో సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస, కోటబమ్మాళి మండలం చిట్టివలస, శ్రీకాకుళం మండలం సింగుపురం దరి భైరినాగులపేట ఉన్నాయి. ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలంటూ ఎపిఇపిడిసిఎల్ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేయడంతో అక్టోబరులో ఆయా మండలాల తహశీల్దార్లు భూమిని గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. భైరినాగులపేటలో 3.5 మెగావాట్లు, వెన్నెలవలసలో ఐదు మెగావాట్లు, కోటబమ్మాళి మండలం చిట్టివలసలో 2.5 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి టెండర్లను పిలిచింది. ఇదివరకే టెండర్లను దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన పారాడిగ్మేట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా అందించేందుకు అక్టోబరులోనే కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీంతో సంబంధిత కంపెనీ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సిద్ధమవుతోంది.

వెన్నెలవలసలోని సర్వే నంబరు 50-3లో 20 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్యానల్స్‌తో గిరిజనుల ఉపాధికి తీవ్ర నష్టం వాటిల్లనుంది. వెన్నెలవలసతో పాటు ఆ గ్రామానికి ఆనుకుని ఉన్న బసవమామిడివలస పరిధిలో 25 గిరిజన కుటుంబాలు ఆ భూములపై ఆధారపడి బతుకుతున్నారు. వరి, పత్తి, మినుము, జన్న తదితర పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పంటల ద్వారా వచ్చిన ఆదాయం తప్ప వారికి వేరే మార్గం లేదు. ఇప్పుడు తమను ఉన్నపళంగా వెళ్లిపోమ్మంటే పిల్లాపాపలతో ఎలా బతకాలి అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. తమ బతుకులు నాశనమవుతాయనే ఉద్దేశంతో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఒకవైపు వ్యతిరేకిస్తున్నామని, సోలార్ ప్యానల్స్ రూపంలో బతుకుదెరువు పోయేలా ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

# ట్రంప్ వార్నింగ్‌తో వెనక్కి తగ్గిన ఇరాన్

## 800 మంది ఉరిశిక్షలపై స్టే!



**ఇరాన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక పశ్చిమాసియాలో పెను మార్పుకు కారణమైంది. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన 800 మంది నిరసనకారులకు అమలు చేయాల్సిన మరణశిక్షలను ఆ దేశ ప్రభుత్వం చివరి నిమిషంలో నిలిపివేసింది. ట్రంప్ ప్రభుత్వం నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి, సైనిక చర్యకు సైతం వెనకాడబోమన్న సంకేతాలే ఇరాన్ వెనక్కి తగ్గడానికి ప్రధాన కారణమని వైట్‌హౌస్ వర్గాలు స్పష్టం చేశాయి. గతేడాది డిసెంబర్ నుంచి ఇరాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకడంతో ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఈ ఉద్యమాలను అణచివేయడానికి ఇరాన్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. వేలాది మందిని జైళ్లలో బంధించడమే కాకుండా, విడతల వారీగా వందలాది మందికి ఉరిశిక్షలు అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ నిరంకుశంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని గత వారమే హెచ్చరించారు.వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ం మీడియాతో మాట్లాడుతూ.. ట్రంప్ హెచ్చరికల వల్లే జరగాల్సిన ఉరిశిక్షలు ఆగిపోయాయని పేర్కొన్నారు. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం కంటే మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా అమెరికా ఈ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరాన్ ఈ ఉరిశిక్షలపై అధికారికంగా స్పందించనప్పటికీ, అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

గతంలో కూడా ట్రంప్ హయాంలో ఇరాన్‌పై కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆయన అధికారం చేపట్టిన తర్వాత ఇరాన్ పట్ల తన దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఈ పరిణామం ఇరాన్‌లోని నిరసనకారులకు కొత్త ఆశలు చిగురింపజేయగా, పశ్చిమాసియాలో అమెరికా పట్టు ఎంత బలంగా ఉందో మరోసారి చాటిచెప్పింది.




# అండర్-19 వరల్డ్ కప్... బోణీ కొట్టిన టీమిండియా కుర్రాళ్లు



అండర్-19 ప్రపంచకప్‌లో ఐదుసార్లు ఛాంపియన్ అయిన భారత యువ జట్టు తన ప్రస్థానాన్ని విజయంతో ప్రారంభించింది. జింబాబ్వేలోని బులవాయోలో గురువారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అమెరికాపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత పేసర్ హెనిల్ పటేల్ 5 వికెట్ల ప్రదర్శనతో అమెరికా బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ హెనిల్ పటేల్ తన తొలి స్పెల్‌లోనే అమెరికా టాపార్డర్‌ను దెబ్బతీశాడు. కేవలం 12 ఓవర్లలోనే 35 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి యూఎస్ఏ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో అమెరికా జట్టు 35.2 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌట్ అయింది. హెనిల్ పటేల్ 16 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి ఈ టోర్నీలో తొలి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన బౌలర్‌గా నిలిచాడు.

అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఈ మ్యాచ్ ద్వారా 14 ఏళ్ల 294 రోజులకే అరంగేట్రం చేసి, ఖ19 ప్రపంచకప్‌లో ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ త్వరగా ఔటయ్యాడు. కాసేపటికే వర్షం, మెరుపుల కారణంగా ఆటకు అంతరాయం కలిగింది. దీంతో భారత లక్ష్యాన్ని 37 ఓవర్లలో 96 పరుగులుగా నిర్ధారించారు. వర్షం తర్వాత ఆట మొదలవగా, భారత్ 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అభిగ్యాన్ కుందు (42 నాటౌట్), విహాన్ మల్హోత్రా కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చారు.

# టీమిండియా ప్లేయర్లను వెంటాడుతున్న గాయాలు

## సుందర్ టీ20 సిరీస్‌కు కూడా దూరం



టీమ్‌ఇండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా ఇప్పటికే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్?కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తాజాగా టీ20 సిరీస్ నుంచి కూడా తప్పుకున్నాడు. దీంతో ఫ్యాన్స్ ఆందోళనకు గురవుతున్నారు. అయితే అతడి స్థానంలో టీ20 సిరీస్‌లో ఎవరు ఆడతారో అనేది బీసీసీఐ ఇంకా ప్రకటన చేయలేదు. కాగా, జనవరి 21 నుంచి కివీస్?తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో భాగంగా ఇటీవల వడోదర వేదికగా తొలి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్?లో వాషింగ్టర్? సుందర్ వెన్ను నొప్పి గాయానికి గురయ్యాడు. దీంతో ఆ మ్యాచ్?లో ఐదు ఓవర్లే బౌలింగ్ చేశాడు. ఆనంతరం అతడు మైదానాన్ని వీడాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చినా, క్రీజులో ఇబ్బంది పడుతున్నట్లు కనిపించాడు. దీంతో అతడు మిగిలిన వన్డే సిరీస్‌కు దూరమవుతున్నట్లు బీసీసీఐ ఆ మ్యాచ్ అనంతరం ప్రకటించింది. అతడి స్థానంలో ఆయుశ్ బదోనిని జట్టులోకి తీసుకుంది. అయితే ఆ గాయం ఇంకా తగ్గకపోవడంతో అతడు టీ20 సిరీస్‌కు సైతం దూరం కావాల్సి వచ్చింది. కీవిస్ సిరీస్‌కు దూరమైన సుందర్, ఫిబ్రవరి 7న ప్రారంభంకానున్న వరల్డ్‌కప్ నాటికి కోలుకుంటాడా? లేదా అని ఫ్యాన్స్‌లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే వరల్డ్‌కప్ కోసం బీసీసీఐ ప్రకటించిన భారత జట్టులో సుందర్ సభ్యుడు. దీంతో పొట్టి కప్పు టోర్నీకి మరో మూడు వారాలే ఉండడంతో అతడు ఫిట్‌నెస్ సాధించి రీ ఎంట్రీ ఇవ్వడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**మొదటి టీ20 - జనవరి 21 - నాగ్‌పూర్**
**రెండో టీ20 - జనవరి 23 - రాయ్‌పూర్**
**మూడో టీ20 - జనవరి 25 - గువాహటి**
**నాలుగో టీ20- జనవరి 28- విశాఖపట్నం**
**ఐదో టీ20 - జనవరి 31- తిరువనంతపురం**

వరల్డ్‌కప్‌కు ముంగిట టీమ్‌ఇండియాను ఆటగాళ్ల వరుస గాయాలు వెంబడిస్తున్నాయి. ఇటీవల తిలక్ వర్మకు సర్జరీ అయ్యింది. విజయ్ హజారే ట్రోఫీలో మ్యాచ్ ఆడుతుండగా అతడు పొత్తికడుపు నొప్పితో ఇబ్బందిపడ్డాడు. దీంతో అతడిని వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. ఈ కారణంగా అతడు కివీస్ టీ20 సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైనట్లు బీసీసీఐ ప్రకటించింది. అయితే ఆ తర్వాతైనా అతడు జట్టులోకి వస్తాడా అనేది ఆనుమానంగా మారింది. కానీ, వరల్డ్‌కప్ నాటికి మాత్రం తిలక్ పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇలా వరల్డ్‌కప్ ముందు టీమ్‌ఇండియాను స్టార్ ఆటగాళ్ల గాయాలు కలవరపెడుతున్నాయి. ప్రపంచకప్‌లో పాల్గొనే జట్టును బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. ఆ జట్టులో ప్రస్తుతం సుందర్, తిలక్ వర్మ గాయాలతో ఆటకు దూరమయ్యారు. వీళ్లు ఈ టోర్నీ ప్రారంభం వరకు కోలుకొని వస్తే పర్వాలేదు. లేదంటే రిప్లేస్‌మెంట్ ప్రకటించాల్సి ఉంటుంది. వరల్డ్‌కప్ కోసం ప్రకటించిన జట్టులో ఏమైనా మార్పులు, రిప్లేస్‌మెంట్లు ఉంటే జనవరి 31లోపే ప్రకటించాల్సి ఉంది. అయితే టోర్నమెంట్ మధ్యలో కూడా రీప్లేస్‌మెంట్‌లు చేసుకోవచ్చు. కానీ అందుకు ఐసీసీ అనుమతి కావాల్సి ఉంటుంది.




# 'నారీ నారీ నడుమ మురారి'

## మూవీ రివ్యూ




సంక్రాంతి బరిలో చివరిగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం నారీ నారీ నడుమ మురారి. చాలా కాలం తర్వాత శర్వానంద్ నటించిన పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. సామజవరగమన సినిమాతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రానికి దర్శకుడు కావడంతో, మరోసారి అదే స్థాయి వినోదం దక్కుతుందా? అనే ఆసక్తి నెలకొంది. మరి ఈ సినిమా ఆ అంచనాలను అందుకుందా? శర్వానంద్‌కు ఇది సరైన కంబ్యాక్‌గా నిలిచిందా? ఇప్పుడు చూద్దాం.

గౌతమ్ (శర్వానంద్) బీటెక్ పూర్తి చేసి ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్న యువకుడు. అతడు నిత్య (సాక్షి వైద్య)ను ప్రేమిస్తాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. అయితే నిత్య తండ్రి రామలింగం (సంపత్ రాజ్) ఈ పెళ్లికి మొదట ఒప్పుకోడు. చివరికి ఒక షరతుతో అంగీకరిస్తాడు. అదేంటంటే పెళ్లి రిజిస్టర్ ఆఫీస్‌లోనే జరగాలి. అనుకోని పరిస్థితుల్లో గౌతమ్ ఈ షరతుకు ఓకే చెబుతాడు. పెళ్లి కోసం దరఖాస్తు చేసిన తర్వాతే అతడి జీవితంలో పెద్ద సమస్య మొదలవుతుంది. గౌతమ్ గతంలో కాలేజీలో ప్రేమించిన దియా (సంయుక్త) మళ్లీ అతడి జీవితంలోకి రావడం కథలో కీలక మలుపు. ఒకవైపు నిత్యతో పెళ్లి, మరోవైపు దియా గతంతో సంబంధం ఈ రెండింటి మధ్య గౌతమ్ చిక్కుకుపోతాడు. ఈ వ్యవహారంలో అతడి తండ్రి కార్తీక్ (నరేశ్), పిన్ని పల్లవి (సిరి హనుమంతు)ల దాంపత్య జీవితం కూడా విడాకుల దాకా వెళ్తుంది. దీనికి గౌతమ్ చేసిన తప్పులే కారణమా? లవకుశ (సత్య), సత్యమూర్తి (సునీల్), గుణశేఖర్ (వెన్నెల కిశోర్) పాత్రలు ఈ కథలో ఎలా కీలకంగా మారాయి? చివరికి గౌతమ్ సమస్య నుంచి ఎలా బయటపడతాడు? అన్నది సినిమాను చూసి తెలుసుకో వాల్సిందే.



మొదటి సన్నివేశం నుంచే దర్శకుడు ఇది పూర్తిగా కామెడీ జానర్ సినిమా అనే సంకేతాన్ని ఇస్తాడు. వయసైన తండ్రి యువతిని ప్రేమించడం, ఆ ప్రేమను కొడుకు బలవంతంగా పెళ్లి వరకు తీసుకెళ్లడం వంటి సన్నివేశాలతో నవ్వులు మొదలవుతాయి. ఆ తర్వాత గౌతమ్ నిత్యల ప్రేమకథను సరళంగా చూపిస్తూ కథను పెళ్లి దిశగా నడిపిస్తారు. నిత్య తండ్రితో గౌతమ్ తన ప్రేమకథను చెప్పే సన్నివేశాలు, వాటికి వచ్చే కామెడీ డైలాగ్స్ మంచి వినోదాన్ని ఇస్తాయి. అయితే కథ రిజిస్టర్ ఆఫీస్‌కు చేరిన తర్వాతే అసలు వినోదం మొదలవుతుంది. అక్కడి నుంచి సినిమా పూర్తిగా నవ్వుల ట్రాక్‌లోకి వెళ్తుంది.

గౌతమ్ గత ప్రేమకథ బయటపడటం, దియా మళ్లీ అతడి జీవితంలోకి రావడం, ఒక తప్పును దాచేందుకు మరో తప్పు చేయడరౌ ఇలా ఒక్కొక్క సంఘటన కథను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ద్వితీయార్ధంలో కోర్టు చుట్టూ నడిచే విడాకుల డ్రామా, ఆఫీస్‌లో వచ్చే సమస్యలు అన్నీ కలిసి మంచి కామెడీని పండించాయి. సాధారణంగా ఇలాంటి కథల్లో ద్వితీయార్ధం బోర్ కొట్టే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ దర్శకుడు ఆ లోపం రాకుండా జాగ్రత్త పడ్డాడు. ప్రీక్లైమాక్స్‌లో సినిమా కొంచెం భావోద్వేగంగా మారినా, క్లైమాక్స్‌ను పూర్తిగా వినోదాత్మకంగా ముగించడం ప్లస్ పాయింట్. ప్రేక్షకులు నవ్వుతూ థియేటర్ నుంచి బయటకు వచ్చేలా సినిమా ముగుస్తుంది.

శర్వానంద్ ఈ సినిమాలో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇద్దరు అమ్మాయిల మధ్య ఇరుక్కుని ఫ్రస్ట్రేషన్‌తో తిరిగే యువకుడిగా అతడి నటన సహజంగా అనిపిస్తుంది. లుక్స్ పరంగా కూడా కొత్తగా కనిపించాడు. సాక్షి వైద్య, సంయుక్త ఇద్దరూ తమ పాత్రల్లో బాగానే ఒదిగిపోయారు. నరేశ్ నటన ఈ సినిమాకు ప్రధాన బలం. ముఖ్యంగా ద్వితీయార్ధంలో కోర్టు సన్నివేశాల్లో ఆయన చేసే కామెడీ ప్రేక్షకులను నవ్విస్తుంది. వెన్నెల కిశోర్, సత్య, సునీల్ తమ కామెడీ టైమింగ్‌తో సినిమాకు అదనపు బలం ఇచ్చారు. అతిథి పాత్రలో శ్రీవిష్ణు చేసిన సందడి కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

విశాల్ చంద్రశేఖర్ సంగీతం సినిమాకు ప్లస్. పాటలు, నేపథ్య సంగీతం కథకు తగ్గట్టుగా ఉన్నాయి. సినిమాటోగ్రఫీ బాగుంది. నిర్మాణ విలువల్లో ఎక్కడా రాజీ పడలేదు.

# ఏప్రిల్ 2న థియేటర్స్‌లోకి 'దృశ్యం 3'



సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం' సిరీస్ అభిమానులకు మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ అదిరిపోయే శుభవార్త అందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దృశ్యం 3' సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ఏప్రిల్ 2, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ఆయన వెల్లడించారు. ఈ ప్రకటనతో జార్జ్‌కుట్టి మూడోసారి ఎలాంటి మాయ చేయనున్నాడో అనే ఉత్కంఠ ప్రేక్షకుల్లో మొదలైంది.

మోహన్‌లాల్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఒక మోషన్ పోస్టర్‌ను పంచుకున్నారు. దానికి "సంవత్సరాలు గడిచాయి. గతం కాదు" అనే ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్‌తో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో, ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరుంబవూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సినిమాకు సంబంధించి మరో కీలకమైన విషయం ఏమిటంటే, మలయాళ మాతృక విడుదలైన దాదాపు ఆరు నెలల తర్వాత హిందీ రీమేక్ రానుంది. అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హిందీ 'దృశ్యం 3' అక్టోబర్ 2, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. సాధారణంగా రెండు వెర్షన్లు ఒకేసారి చిత్రీకరించి ఒకేరోజు విడుదల చేస్తుంటారు, కానీ ఈసారి మాతృకకు ఎక్కువ సమయం ఇవ్వడం గమనార్హం.

'దృశ్యం 3'లో మోహన్‌లాల్‌తో పాటు మీనా, అన్సిబా హసన్, ఎస్తేర్ అనిల్ తమ పాత పాత్రల్లోనే కనిపించనున్నారు. గత రెండు భాగాల్లో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి జార్జ్‌కుట్టి పన్నిన వ్యూహాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు మూడో భాగంలో ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి, వాటిని ఎలా అధిగమిస్తాడో చూడాలని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**